క్లుప్తంగా

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

నారాయణఖేడ్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వ్యక్తులు, మతాలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులను రెచ్చగొట్టేవిధంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో శివవర్ధన్, బిక్కి, బాలికల విభాగంలో ఆర్తి, నేహలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆలయ హుండీ లెక్కింపు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో గురువారం దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. మూడు నెలల నుంచి భక్తులు హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.4,45,228 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

'రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం'

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారమని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి, ఇమాంనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆరు పథకాల గ్యారెంటీ స్కీంల వివరాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో తాము చేపడుతున్న ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్త పరీక్షలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పారిశ్రామిక వాడల్లోని కార్మికులకు సంపూర్ణ సురక్షా కార్యక్రమంలో భాగంగా గురువారం సంపూర్ణ సురక్షా ప్రోగ్రాం మేనేజర్ ఉప్పలయ్య, నిర్వాహకురాలు శారద ఆధ్వర్యంలో రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కాలనీల్లో ఉచితంగా రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

సేవా కార్యక్రమాలపై అవగాహన

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ కళాశాల విద్యాశాఖ, జాతీయ సేవా పథకం ఉస్మానియా యూనివర్సిటీ ఆదేశాల మేరకు సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక సేవా కార్యక్రమాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ సేవాపథకం రెండవ విభాగం అధికారి పద్మ మాట్లాడుతూ పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకం తదితర సామాజిక కార్యక్రమాలపై వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తాడేపల్లి పతంజలి అధ్వర్యంలో మేరా మట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయండి

పటాన్‌చెరు టౌన్: ఎలక్షన్ కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న నక్కవాగు బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి గోడలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సంబంధించిన వాల్‌రైటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ వాల్‌రైటింగ్ రాస్తున్న వారిపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. పటాన్‌చెరులో ఎలక్షన్ కోడ్ ఉన్నట్టా.. లేనట్టా.. అని నిలదీశారు. ఇటువంటి రాతలను అధికారులు అడ్డుకోవాలని కోరారు.

సలహాలు పాటిస్తే లాభాలు

కల్హేర్(నారాయణఖేడ్): పత్తి సాగులో సలహాలు, సూచనలు పాటిస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ నిపుణులు మనోజ్ కన్న తెలిపారు. సిర్గాపూర్ మండలం బోక్కస్‌గాంలోని ఉత్తమ రైతు జర సంగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పత్తి సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ప్రభాత్ పత్తి విత్తన కంపెనీ తరఫున రైతులకు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ విఠల్‌రావు, రైతులు సాయిరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

కల్హేర్(నారాయణఖేడ్): రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మాసాన్‌పల్లి, కృష్ణాపూర్‌లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

పాల శీతలీకరణ కేంద్రానికి తాళం

- ఎనిమిదేళ్లు గడుస్తున్నా తెరుచుకోని వైనం
- తుప్పపడుతున్న యంత్ర పరికరాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు,
- ఆర్థికంగా నష్టపోతున్న పాడి రైతులు

గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో రూ.కోటి వెచ్చించి ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రం అధికారుల అలసత్వంతో మూతపడింది. దీంతో రైతులు చేసేదేమీ లేక ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. పాలశీతలీకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు పాడి పరిశ్రమ అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని రైతులు వాపోతున్నారు.

– హత్నూర (సంగారెడ్డి)



మూతపడిన పాల శీతలీకరణ కేంద్రం

హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో 2009లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డిని రైతులు పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా గ్రామానికి చెందిన దివంగత రాజ్‌విఠల్ గుప్తా స్థలాన్ని ఉచితంగా అందజేశారు. దీంతో కోటి రూపాయలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రాన్ని 2009 ఫిబ్రవరి 8న సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. దౌల్తాబాద్ పాటు పరిసర ప్రాంతాలైన మంగాపూర్, దేవులపల్లి, హత్నూర దౌలాపూర్, కాసాల మల్కాపూర్, నాస్తిపూర్, రెడ్డిఖానపూర్, బోర్‌పట్ల తదితర ప్రాంతాల నుంచి రైతులు పాలు తీసుకొచ్చేవారు. ఈ క్రమంలో ఆరు నెలలు మాత్రమే పాలను సేకరించిన కేంద్రం నిర్వాహకులు ఆతర్వాత మూతపడేశారు.

నష్టపోతున్న పాడి రైతులు

ఎనిమిది ఏళ్లుగా పాలశీతలీకరణ కేంద్రం మూతపడటంతో పాడి రైతులు దౌల్తాబాద్‌లోని ప్రైవేట్ పాల కేంద్రాల్లో రైతులు పాలను విక్రయిస్తున్నారు. నెల రోజులకోసారి మాత్రమే డబ్బులు చెల్లిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలశీతలీకరణ కేంద్రాన్ని పుణ ప్రారంభిస్తే రోజుకు వందలాది లీటర్ల పాల సేకరణ జరుగడంతో పాటు రైతులకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా పాడి పరిశ్రమ అభివృద్ధి సహాయక సమైక్య అధికారులు స్పందించి పాల శీతలీకరణ కేంద్రాన్ని పుణ ప్రారంభించాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

సరైన ధర లభించడంలేదు



పాల శీతలీకరణ కేంద్రాన్ని మూసివేయడంతో ఎనిమిదేళ్లుగా ప్రైవేట్ పాల కేంద్రాలను ఆశ్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నాం. ధర కూడా సరిగా లభించడంలేదు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నాం.

– శ్రీకాంత్, రైతు, దేవులపల్లి

అధికారులు స్పందించాలి



కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రం మూతపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చేసేదేమీలేక పాలను ప్రైవేట్ కేంద్రాల్లో విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాల కేంద్రాన్ని ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, రైతు, దౌలాపూర్

కష్టపడేవారికి సముచిత స్థానం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ బలోపేతం కోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్, పోచారం గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు శ్రీకాంత్, షకీల్, మోయిన్, అంజి బాబు, హశం, అజ్మత్, జీవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

పటాన్‌చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్, ఈశ్వర్, శ్రీనివాస్, రమేష్, ప్రభాకర్, నవీన్, మధుసూదన్‌రెడ్డి, శరణప్ప, సత్యనారాయణ, సుధాకర్, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలను అమలుచేస్తాం

మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలుచేస్తామని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. మండలంలోని అల్లాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులతో పాటు మేళసంగ్యం, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి, రాయికోడ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు అల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, తాటిపల్లి రాంరెడ్డి, రాయికోడ్ మాజీ జడ్పీటీసీ నాగారం అంజయ్య, ఎంపీటీసీ పాండు, పార్టీ మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, అంతారం నర్సింహగౌడ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి: చౌటకూర్ మండలంలోని చక్రియాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామశాఖ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా సమక్షంలో చేరారు.

చదువుకు దూరం కావొద్దు

ఎంఈఓ అంజయ్య



మానసకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): తల్లిదండ్రుల కుటుంబ కలహాలతో బాల, బాలికలు చదువుకు దూరం కావొద్దని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. సదాశివపేట మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మంగళి మానస చదువు మానేసింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో మానసను 9వ తరగతిలో చేర్పించి పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానస కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల గొడవలతో కొన్ని రోజుల నుంచి మానసను చదువు మాన్పించి కూలిపనులు చేయిస్తున్నారని తన దృష్టికి రావడంతో బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి లలిత, ప్రధానోపాధ్యాయులు సురేందర్, సీఆర్పీ రాజేశ్వర్, సీఆర్టీలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నగదును చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. పటాన్‌చెరు పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ వాహనాల తనిఖీలో అమీన్‌పూర్‌కు చెందిన సాంబశివరావు వద్ద రూ.3,40 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పోలీసులు సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ ఫోర్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో విజయవాడకు చెందిన కృష్ణప్రసాద్ వద్ద రూ.2, 40లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

16న బోగ్‌బండార్

నారాయణఖేడ్: మండల పరిషత్ కార్యాలయ సమీపంలో శ్రీరాంరావు మహారాజ్ ట్రస్ట్‌కు కేటాయించిన స్థలంలో ఈ నెల16న మహా బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్ర మరేశ్‌చౌహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో గిఫ్ట్ బాక్సుల ఏర్పాటు

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్‌స్టాండ్‌ల్లో గిఫ్ట్ బాక్సులను ఏర్పాటు చేశామని డీఎం మల్లేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 23 వరకు, 28 నుంచి 30వ తేది వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికులు టికెట్లపై తమ పేరు ఫోన్ నెంబర్లు రాసి గిఫ్ట్ బాక్సులో వేయాలని సూచించారు. అనంతరం డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

15 నుంచి దేవీనవరాత్రులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ మహాసంస్థాన్ దేవాలయంలో ఈ నెల 15 నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరిస్తారని మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో పూజలు ఉంటాయన్నారు. మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జహీరాబాద్: ఈ నెల 15న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో ఉచిత క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్, ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మహిపాల్‌రెడ్డి, అధ్యక్షుడు సంగ్రాం పాటిల్, కార్యదర్శి వెంకటేశం తెలిపారు. పట్టణంలోని ఆదర్శ విద్యాలయం ఆవరణలో నిర్వహించనున్న శిబిరానికి హైదరాబాద్‌లోని ప్రముఖ స్టార్ హాస్పిటల్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్టుషాపులను నియంత్రించండి

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల సమయంలో గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని, వీటిని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వీరస్వామి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అండూర్, మాదారం, జంగంపేట, కొడకంచి తదితర గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి బెల్టుషాపులను నియంత్రించాలన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

మునిపల్లి(అందోల్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ యువత రాష్ట్ర ప్రధాన కారదయదర్శి సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బతుకమ్మ సంబురాలను గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగు పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు.

– సంగారెడ్డి న్యూస్‌డెస్క్



హత్నూర: బ్రాహ్మణగూడ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



రామచంద్రాపురం: ఈదులనాగులపల్లి జెడ్పీ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



జహీరాబాద్: కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



రాయిపల్లి(డి) తండా ప్రభుత్వం పాఠశాలలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు



హద్నూర్ జెడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న ఆర్‌ఓ పాండు

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నిజాంపేటలో పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న పాఠశాల భవనాన్ని ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలను ఉపాధ్యాయులను, సర్పంచ్ జగదీశ్వర్‌చారిని అడిగి తెలుసుకున్నారు.

రాయికోడ్ మండలంలో..

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌తో పాటు సింగితం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అందోల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్.పాండు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 313 పోలింగ్ కేంద్రాలు ఉండగా సుమారు 2.45 లక్షల ఓటర్లు ఉన్నారని తెలిపారు. అర్హులైన వారు కొత్తగా ఓటరుగా గుర్తింపు పొందుటకు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ విజయ్ కుమార్, ఆర్‌ఐలు ప్రభాకర్, రాంచందర్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, బీఎల్‌ఓలు ఉన్నారు.

సీఐటీయూను మెజార్టీతో గెలిపించండి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో(నందికంది) పరిశ్రమలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఐటీయూను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని నందికంది గ్రామంలో సీఐటీయూ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఐటీయూతోనే కార్మికులకు ఉద్యోగ భద్రత, మెరుగైన వేతన ఒప్పందం సాధ్యమన్నారు. ఈ నెల 13న నిర్వహించే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, యూనియన్ నాయకులు మల్లేశం, శ్రీనివాస్, వీరేశం, సంజీవరావు, శ్రీనివాస్, జనార్దన్, శేఖర్, పద్మారావు, సాయిలు, విజయ్, చందర్, సురేష్ పాల్గొన్నారు.

పరిశ్రమ అభివృద్ధికి సహకరించండి



మొక్క నాటుతున్న ప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): పరిశ్రమ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎపిటోరియా ఫార్మా కార్పొరేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూఎస్‌బీ రాజు అన్నారు. బోరుపట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్టర్లు సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇదివరకు అరబిందో ఫార్మాగా ఉన్న పరిశ్రమ ఎపిటోరియా ఫార్మాగా మారిందన్నారు. వేలమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఆర్ మేనేజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి చంద్రశేఖర్



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, నియోజవకవర్గం కాంగ్రెస్ చీఫ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఖాజా ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు మక్సూద్, గుండెడ్డి, ముకుంద్‌రెడ్డి, ఎంజి రాములు, ఖాజామియా, జమీల్, అక్బర్, జాఫర్, పాష, నినాయత్ పాల్గొన్నారు.

ఘనంగా పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాల వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ విద్యార్థులను కూడగట్టి రాజీలేని పోరాటాలు చేస్తోందని తెలిపారు. పెండింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఏలియా, ఆకాష్, కోటేశ్వర్‌రావు, పాల్‌రాజ్, శ్రీధర్‌రెడ్డి, మల్లేశ్వరీ, శ్రీనిధి, నందన, సంధ్య, ప్రవీణ, శ్రీకాంత్, అస్లాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.